
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 4 సెప్టెంబరు 2025


చంద్రుగొండ మండలం దామరచర్లలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఆ గిరిజన గ్రామంలో సంబురం అంబరాన్నంటింది. అట్టహాసంగా ఇందిరమ్మ ఇళ్ల పండుగ సాగడంతో ఆ ఆదివాసీ బిడ్డల్లో ఆనందం వెల్లివిరిసింది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు ఉన్నతాధికారులు తమ గ్రామానికి రావడంతో వారంతా పండుగ జరుపుకొన్నారు. పచ్చని తోరణాలు.. భాజా భజంత్రీలు, ఆదివాసీ సంప్రదాయ నృత్యాల మధ్య గ్రామస్థుల స్వాగతం అందుకున్న సీఎం రేవంత్‌రెడ్డి... గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీలు పోరిక బలరాం నాయక్, రామసహాయం రఘురాంరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పైలెట్ గ్రామంగా ఎంపికైన చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఇందిరమ్మ గృహప్రవేశ వేడుకకు హాజరయ్యారు. లబ్ధిదారులతో మమేకమై యోగక్షేమాలు తెలుసుకున్నారు. అభివృద్ధి సంక్షేమంపై వారికి భరోసా ఇచ్చి ముందుకు సాగారు.

గిరిజన సంబురం


రిబ్బన్ కట్ చేసి బచ్చల నర్సమ్మతో గృహప్రవేశం చేయిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

బెండాలపాడులో అట్టహాసంగా 'ఇందిరమ్మ' గృహప్రవేశ వేడుక

- లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన ఆనందం
- ఇళ్ల యజమానులకు సీఎం రేవంత్ ఆప్యాయ పలకరింపు
- దామరచర్లలో ఉత్సాహంగా సాగిన సభ
- అభివృద్ధి, సంక్షేమంపై భరోసా ఇచ్చిన సీఎం
- కేసీఆర్ కుటుంబంపై విమర్శనాస్త్రాలు
- పొంగులేటిపై ప్రశంసల వర్షం
- కష్టకాలంలో కమ్యూనిస్టుల స్నేహబంధాన్ని గుర్తుచేసిన రేవంత్

ఖమ్మం/ కొత్తగూడెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెండాలపాడు గ్రామానికి బుధవారం మధ్యాహ్నం 2.20 గంటలకు చేరుకోవాల్సిన సీఎం గంటన్నర ఆలస్యంగా గ్రామానికి చేరుకున్నారు. అయినప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు, అనంతరం నిర్వహించిన సభ సక్సెస్ అయింది. బెండాలపాడు గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు బచ్చల నర్సమ్మ, రమణకు చెందిన ఇళ్లను సీఎం, మంత్రులు సీఎం, మంత్రులు ప్రారంభించి.. ఆయా కుటుంబాలతో గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా బచ్చల నరసమ్మ నివాసంలో అల్పాహారం తీసుకున్నారు. అక్కడ నరసమ్మ మనవరాలు పాన్యశ్రీ వెన్నెకకు సీఎం గారె తినిపించి ముద్దుచేశారు. అలాగే రమణ కూతురు రాజేశ్వరితో మాట్లాడి కుశల ప్రశ్నలు వేశారు. వారి ఇళ్లలో పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని బొడ్రాయికి పూజలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక నుంచి గ్రామంలోని లబ్ధిదారులతో మాట్లాడి ఆ తర్వాత దామరచర్లలోని బహిరంగ సభ వేదిక వద్దకు కాన్వాయ్‌లో పయనమయ్యారు.


బచ్చల రమణ నివాసంలో ఆమె కూతురు రాజేశ్వరితో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్

ఉత్తేజం నింపిన రేవంత్ ప్రసంగం..

అశ్వారావుపేట జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సభలో రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్తేజం నింపేలా సాగింది. తెలంగాణ తొలి దశ ఉద్యమం ఖమ్మం జిల్లాలోని పాల్వంచలో ప్రారంభమైందని, నాటి ఉద్యమ చరిత్రను గుర్తు చేసిన ఆయన.. తెలంగాణ ఉద్యమానికి దిశదశ చూపిందన్నారు. 'మా ఉద్యోగాలు మాకే కావాలని.. మా నీళ్లు మాకే కావాలి' అని ఉద్యమించిన చైతన్యవంతమైన జిల్లా అని కొనియాడారు. కమ్యూనిస్టులు సహజ మిత్రులని, పేదల కష్టాల పరిష్కారంలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్న పార్టీ అని సీపీఐ మిత్ర పక్షాన్ని ప్రశంసించారు. ముగ్గురు కీలక మంత్రులు ఖమ్మం జిల్లా నుంచే ఉన్నారని.. భట్టి విక్రమార్క, పొంగులేటి, తుమ్మల వద్ద కీలక శాఖలే ఉన్నాయంటూ ప్రస్తావించారు. అలాగే ఇదే జిల్లాకు చెందిన రేణుకాచౌదరిని రాజ్యసభకు పంపామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనను పదే పదే గుర్తుచేస్తూ.. నాడు అమలు చేసిన పథకాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుతం తమ ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు వివరించారు. గత కేసీఆర్ ప్రభుత్వం ధరణి పథకానికి దయ్యాంలా పట్టిందని.. కొరివి దయ్యాన్ని తరిమి కొట్టి భూభారతిని పట్టుదలతో మంత్రి పొంగులేటి తెచ్చారని కొనియాడారు. మన కాంగ్రెస్ ప్రభుత్వం మరో పదేళ్ల అధికారంలో ఉంటుందని, సంక్షేమ పథకాలన్నీ అర్హులకు అందుతాయని భరోసా నింపారు. జిల్లాలో పీసీసీ అధ్యక్షుడిగా (మిగతా 6వ పేజీలో)

శ్రీకారం.. గృహప్రవేశం భద్రాద్రి నుంచే..

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి శ్రీకారం, గృహప్రవేశ మహోత్సవం రెండూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచే మొదలయ్యాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రతిష్ఠాత్మకమైన ఇందిరమ్మ గృహనిర్మాణ పథకాన్ని గత ఏడాది మార్చి 11వ తేదీన పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో ప్రారంభ సభ నిర్వహించారు. సభలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లకు నమూనాను విడుదల చేసి కొందరు గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం బుధవారం చంద్రుగొండ మండలం బెండాలపాడునుంచి ఇళ్లకు గృహప్రవేశ మహోత్సవాన్ని ఇక్కడే నిర్వహించారు. బెండాలపాడు గ్రామంలో 90 శాతం మంది గిరిజనులు ఉండగా.. భద్రాచలం సైతం గిరిజన ప్రాంతం కావడం విశేషం.


సభకు హాజరైన ప్రజలు



'ధన'నాథుడు



రూ.51 లక్షలతో గణపయ్యకు అలంకరణ

సత్తుపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నవరాత్రుల సందర్భంగా ఆ బొజ్జగణపయ్య విభిన్న పూజలు అందుకుంటున్నాడు. వివిధ రకాల నైవేద్యాలు, ప్రత్యేక అలంకరణలతో ఆ ఆదిదేవుడు దేదీప్యమానమై వెలిగిపోతున్నాడు. ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని 16వ వాసవీ గణపతి మండపాన్ని రూ.51,600 కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఈ క్రమంలో ధననాథుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం సత్తుపల్లి పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలోని వర్తక ప్రాంగణంలోని సత్తుపల్లి పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ సత్తుపల్లి గ్రేటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలో విఘ్నేశ్వరుడిని భక్తులు, వ్యాపారులు తమ వద్ద ఉన్న నోట్లను సేకరించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు వందనపు సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీధర్ తెలిపారు. పది, 20, 50, 100, 200, 500 నోట్లను వినియోగించగా.. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ధన్- ధాన్య కృషి యోజనలో.. భద్రాద్రిని చేర్చండి

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి చౌహాన్‌కు తుమ్మల వినతి

కొత్తగూడెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ధన్- ధాన్య కృషి యోజనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను చేర్చాలని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న తుమ్మల బుధవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి రాష్ట్ర రైతుల సమస్యలను వివరించారు. అందులో భాగంగా ఇటీవల ప్రారంభమైన ప్రధానమంత్రి ధన్- ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై)లో తెలంగాణకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రూ.24వేల కోట్ల వార్షిక వ్యయంతో ఆరు సంవత్సరాలు అమలు చేయబోతున్న ఈ యోజన 36 కేంద్ర పథకాల సమన్వయంతో పాటు రాష్ట్ర పథకాలతో అనుసంధానమవుతోందని, ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని వినియోగించుకోవడం ద్వారా తక్కువ పనితీరు చూపుతున్న జిల్లాలకు విస్తృతంగా లాభం చేకూరుస్తుందన్నారు. ఉత్పాదకత పెంపు, పంటల వైవిధ్యీకరణ, నీటి పారుదల, నిల్వ లాంటి అంశాల్లో ధన్ ధాన్య కృషి యోజన చారిత్రాత్మక పథకమన్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలోని నారాయణపేట, ములుగు, కొమరంభీం, సంగారెడ్డిలతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను జాబితాలో చేర్చాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా తుమ్మల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ రాష్ట్ర పథకాలతో పూర్తి అనుసంధానం చేస్తూ, కలెక్టర్ల ఆధ్వర్యంలో అగ్రికల్చర్ యూనివర్సిటీలు భాగస్వామ్యంతో బలమైన జిల్లాస్థాయి ప్రణాళికలు సిద్ధం చేస్తుందని, డిజిటల్ మానిటరింగ్ ద్వారా పారదర్శకతను నిర్ధారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్‌రావు, రెసిడెంట్ కమిషన్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.


ఢిల్లీలో కేంద్ర మంత్రితో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

రెండో రోజూ అదే తీరు

- భద్రాద్రి వద్ద నెమ్మదిగా పెరుగుతున్న గోదావరి
- మళ్లీ 43.3 అడుగులకు చేరిన నీటిమట్టం
- రాత్రి 9.50 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ


భద్రాచలం వద్ద నీటమునిగిన స్నానఘట్టాలు

భద్రాచలం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం బుధవారం రాత్రి 9.50 గంటలకు 43 అడుగులకు చేరడంతో భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు 40.4 అడుగులున్న నీటి మట్టం బుధవారం ఉదయం 6 గంటలకు 39.6, 7 గంటలకు 39.5 అడుగులకు తగ్గిన నీటిమట్టం మూడు గంటల పాటు నిలకడగా ఉంది. మళ్లీ 11 గంటల నుంచి స్వల్పంగా పెరుగుతూ 39.6, మధ్యాహ్నం 12 గంటలకు 39.9 అడుగులకు చేరింది. 1 గంటకు 40 అడుగులు, 2 గంటలకు 40.3, 3 గంటలకు 40.6, 4 గంటలకు 40.9, సాయంత్రం 5 గంటలకు 41.4, 6 గంటలకు 41.8, రాత్రి 7గంటలకు 42.1 అడుగులకు పెరుగుతూ వచ్చి రాత్రి 9.50 గంటలకు 43, 11 గంటలకు 43.3 అడుగులకు చేరింది. బుధవారం అర్ధరాత్రికి కొంతమేరకు పెరిగి అనంతరం నిలకడగా ఉండి గురువారం స్వల్పంగా తగ్గుముఖం పట్టే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి 43అడుగులు దాటడంతో స్నానఘట్టాలు పూర్తిగా నీటమునిగాయి. దాంతో భక్తులను, పర్యాటకులను ఎవరినీ అనుమతించడం లేదు. గణేష్ నిమజ్జనానికి భక్తులు తరలివచ్చే సమయం కావడంతో ఘాట్లను పూర్తిగా మెష్‌లతో మూసేశారు. భక్తులు స్నానాలు చేసేందుకు షవర్‌బాత్‌లను ఏర్పాటు చేసి ఆ ప్రాంతానికి మాత్రమే అనుమతిస్తున్నారు.

యూరియా కొరత.. రైతన్న చింత

- ఒక్కబస్తా కోసం గంటల తరబడి వేచిచూస్తున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో పలు సొసైటీల వద్ద ఉద్రిక్త పరిస్థితులు
- పోలీస్ బందోబస్తు మధ్య బస్తాల పంపిణీ

నేలకొండపల్లి /కూసుమంచి/ జూలూరుపాడు/ఆళ్లపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యూరియా రాక తక్కువగా ఉండటంతో కొరత తీరడం లేదు. ఇదే సమయంలో రైతులు అధిక సంఖ్యలో ఎగబడుతుండటంతో అక్కడక్కడా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒక్క బస్తా కోసం అన్నదాతలు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు చోట్ల రైతులు బారులు తీరగా.. పలు చోట్ల స్వల్ప వాగ్వాదాలు జరిగాయి. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలో బుధవారం అన్ని సొసైటీల వద్ద యూరియాను పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించడంతో రైతులు సొసైటీల వద్ద భారీ సంఖ్యలో బారులు తీరారు. దీంతో అధికారులు ముందు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ సొసైటీకి కేవలం 110 బస్తాల యూరియా మాత్రమే రావటంతో రైతుల మధ్య తోపులాట జరిగి.. స్వల్ప ఉద్రిక్తతలు తలెత్తాయి. పోలీసులు జోక్యం చేసుకుని రైతులను శాంతింపజేశారు. చెర్వుమాధారం, మూటాపురం గ్రామాల్లో యూరియా పంపిణీని అధికారులు పర్యవేక్షించగా.. చెర్వుమాధారంలో రైతులు ఆందోళనకు దిగారు. పర్యవేక్షణకు వచ్చిన అధికారులతో వాగ్వాదానికి దిగారు. అక్కడే ఉన్న పోలీసులు రైతులకు సర్దిచెప్పి గొడవ (మిగతా 8వ పేజీలో)


కూసుమంచిలో బారులు దీరిన రైతులు

టెట్‌పై తీర్పు.. టీచర్లలో గుబులు

- 2012 ముందు ఉద్యోగం పొందిన వారికి ఉత్తీర్ణత తప్పనిసరి
- జిల్లా ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశం



కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 2012కు ముందు ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందినవారు తప్పని సరిగా టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) ఉత్తీర్ణత సాధించాల్సిందేనని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు జిల్లాలోని ఉపాధ్యాయుల గుండెల్లో గుబులు రేకెత్తిస్తోంది. ఉపాధ్యాయ ఉద్యోగం పొందాలంటే కనీస అర్హతలతో పాటు తప్పనిసరిగా టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) పాసై ఉన్న వారందరూ డీఎస్సీ పరీక్షల్లో పాల్గొనడానికి అర్హులు. గతంలో ఉపాధ్యాయులు నేరుగా డీఎస్సీ పోటీ పరీక్షల్లో పాల్గొనడానికి వీలుండేది. గిరిజనులైతే డీఎడ్, బీఎడ్ అర్హతలు లేకపోయినా.. డీఎస్సీ పరీక్షలకు అర్హులుగా ఉన్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత డీఈడీ, బీఈడీ కోర్సులు చదువుకునే ఇన్ సర్వీసు కూడా వీలు కల్పించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఉపాధ్యాయ నియామకాల్లో అనేక అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా జిల్లాతో పాటు పలు ఏజెన్సీ ప్రాంతాల నియామకాల్లో ఫేక్ సర్టిఫికెట్స్‌తో ఉద్యోగం పొందిన వారున్నారనే (మిగతా 6వ పేజీలో)

గిరిజన సంబురం

(5వ పేజీ తరువాయి)

ఖమ్మం జిల్లాలో పాదయాత్ర చేసిన ఘటనను రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. నాడు బీఆర్‌ఎస్‌కు చేసిన సవాల్‌ను కూడా సభలో ప్రస్తావించారు.

బీఆర్‌ఎస్, కేసీఆర్ కుటుంబంపై వ్యాఖ్యలు

సీఎం రేవంత్‌రెడ్డి.. గత ప్రభుత్వ పాలన అవినీతి పాలన, తాజాగా ఎమ్మెల్సీ కవిత వ్యవహారంలో కేసీఆర్ కుటుంబంలో తలెత్తిన విభేదాలను, ఈ క్రమంలో తమపై వారు చేస్తున్న ఆరోపణలను ఎండగడుతూ చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. గత పదేళ్లలో కేసీఆర్ కుటుంబం రూ. లక్షల కోట్లు సంపాదించి.. ఇప్పుడు పంపకాల్లో కత్తులు దూసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌లో నడుస్తున్న ప్రస్తుత రాజకీయ సంక్షోభంపై కూడా కార్యకర్తలను, నాయకులను ఆకట్టుకునేలా ఆయన సభలో ప్రసంగించారు.

అభివృద్ధి, సంక్షేమంపై హామీ..

తమ ప్రజాప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తోందని, ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని సీఎం రేవంత్ భరోసానిచ్చారు. ఇందుకు ఇన్‌చార్జ్ మంత్రి అధ్యక్షతన జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించి అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు పంపాలని, అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అధికారులు కూడా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో మరో 25 లక్షల ఇళ్లు నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు పథకాలను, జరుగుతున్న అభివృద్ధిని ఆయన సభలో వివరించారు.

● గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నాడు కేసీఆర్ తన దత్తత గ్రామంతో పాటు సొంతూరు అయిన చింతమడకలోనూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని, ఆ గ్రామాల్లోనూ తమ ప్రజాప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ఇళ్లు కట్టించి ఇస్తున్నామన్నారు. తల తాకట్టు పెట్టయినా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరతామన్నారు.

● యువజన క్రీడాశాఖ, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొందరికి గిట్టడం లేదన్నారు. పదేళ్ల కేసీఆర్ అరాచక పాలనను సీఎం రేవంత్ రెడ్డి కూకటి వేళ్లతో పెకిలించి ఇందిరమ్మ రాజ్యం తెచ్చారన్నారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వకుండా అనేక పథకాలు అమలు చేస్తున్నారని, క్యాబినెట్ మంత్రులు యావత్తు రోజుకు 18గంటలకు పైగా పనిచేస్తున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అందరివాడని ఆవేశం ఉన్నా.. ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలిసిన నిప్పు కణికని అన్నారు. రేవంత్‌రెడ్డిని మరొక పర్యాయం ముఖ్యమంత్రి చేస్తే అందరికి ఇందిరమ్మ గృహాలు వస్తాయని, ప్రజాస్వామిక వాదిగా, ఉద్యమ కారుడిగా ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడని తెలిపారు. ఇంకా ఈ సభలో గృహనిర్మాణ శాఖ ఎండీ వీపీ గౌతమ్, భద్రాచలం, ఇల్లెందు, వైరా, సత్తుపల్లి, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, మలోతు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి , ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మువ్వా విజయబాబు, రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, ఖమ్మం డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మీరంతా సంతోషమే కదా..!

- పిల్లల్ని చదివించి పెళ్లిళ్లు చేయండి
- వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం
- సీఎం రాకతో బెండాలపాడులో పండుగ వాతావరణం



కొత్తగూడెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'అందరూ బాగున్నారా.... మంచిగా ఉన్నారా.. కాంగ్రెస్ ప్రభుత్వంలో మీ గ్రామంలో 312 ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, రేషన్ కార్డులు ఇచ్చాం.. మీరు అంతా సంతోషమే కదా' సీఎం రేవంత్‌రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బెండాలపాడు ఇందిరమ్మ ఇళ్ల గృహ మహోత్సవంలో పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడిన మాటలు. హెలీప్యాడ్ నుంచి నేరుగా బెండాలపాడుకు వెళ్లిన ఆయన లబ్ధిదారులతో కలిసే రిబ్బన్ కట్ చేసి కొబ్బరికాయలు కొట్టి గృహప్రవేశం చేయించారు. వారికి నూతన వస్త్రాలు బహూకరించారు. అనంతరం గ్రామంలో బొడ్డురాయికి పూజలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో అందరూ పిల్లల్ని చదివించాలని, వారికి పెళ్లిళ్లు చేసిన అనంతరం వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. కాగా.. సీఎం పర్యటనతో ఆ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆయన లబ్ధిదారులతో వారి ఇళ్లల్లో కలిసి కూర్చొని పరమాన్నం, గారెలు తినడం, ఓ లబ్ధిదారుని మనువరాలికి తినిపించడంతో ఆ కుటుంబం సంతోషంలో మునిగితేలింది. మూరుమూల గ్రామంగా ఉన్న బెండాలపాడును గుర్తించి ఆ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా స్వీకరించడం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



బచ్చల నరసమ్మ నివాసంలో అల్పాహారం స్వీకరిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు ఆదినారాయణ, రాందాస్‌నాయక్



నరసమ్మకు చీర,సారె అందజేస్తున్న సీఎం



సభా వేదికపై సీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న లబ్ధిదారులు



ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రెండున్నర గంటల పాటు సీఎం పర్యటన

చంద్రుగొండ / అశ్వారావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన రెండున్నర గంటలపాటు సాగింది. షెడ్యూల్ ప్రకారం కంటే గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. షెడ్యూల్ ప్రకారం 2.20 గంటలకు రావాల్సిన సీఎం 3.45 గంటలకు చంద్రుగొండలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుండి మండలంలోని ఆదర్శ గ్రామం బెండాలపాడుకు 4.02 గంటలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రికి గ్రామానికి చెందిన ఆదివాసీలు తమ సంప్రదాయ గిరిజన నృత్యాలు, మేళతాళాలు, పూలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బచ్చల రమణ, బచ్చలు నర్సమ్మ ఇందిరమ్మ ఇళ్లను సీఎం రేవంత్‌రెడ్డి గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకటి శ్రీహరి, ఎంపీలు రామసహాయం రఘురామరెడ్డి, బలరామ్‌నాయక్, స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి ప్రారంభించారు. గృహప్రవేశాల అనంతరం లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి సీఎం పూజలు చేసి తీర్థ ప్రసాదాలు, పరమాన్నం స్వీకరించారు. అనంతరం గ్రామం మధ్యలో బొడ్డురాయికి పూజలు చేసి ప్రక్కనే ఉన్న ఇందిరమ్మ గృహాల పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. బెండాపాడులో 25 నిమిషాలు పాటు గడిపిన సీఎం 4.27 గంటలకు గ్రామం నుంచి బయలుదేరి మండలంలోని దామరచర్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభావేదిక వద్దకు చేరుకున్నారు. బహిరంగ సభ 1.32 గంటలపాటు కొనసాగి 6.10 గంటలకు ముగిసింది. అనంతరం సీఎం హెలిప్యాడ్‌కు చేరుకొని హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

సీఎం రేవంత్‌కు ఘన స్వాగతం

చంద్రుగొండ/అశ్వారావుపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం 3.45 గంటలకు చంద్రుగొండకు హెలికాప్టర్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరితో కలిసి వచ్చారు. సీఎంకు రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి, ఖమ్మం, మహబూబాద్ ఎంపీలు రఘురామరెడ్డి, బలరామ్‌రాయక్, ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, మట్టా రాగమైయి, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావ్, రాందాస్ నాయక్, హౌసింగ్ ఎండీ గౌతమ్, ఇరిగేషన్ కార్పోరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం కలెక్టర్లు జితేష్ వి పాటిల్, తదితరులు బొకేలు ఇచ్చి స్వాగతం పలికారు.



ఆదివాసీ సంప్రదాయంలో సీఎం, మంత్రులకు స్వాగతం

మూడోసారికి ముడిపడింది..

కొత్తగూడెం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన మూడో తేదీన.. మూడోసారికి ముడి పడినట్టయింది. ఇందిరమ్మ ఇళ్ల ప్రవేశ మహోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి సభను మొదటిసారిగా ఆగస్టు 21వ తేదీన నిర్ణయించారు. ఆ సమయంలో ఉపరాష్ట్రపతి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన క్రమంలో వాయిదా పడింది. రెండోసారి ఆగస్టు 30న జరగాల్సి ఉండగా.. అదీ కూడా వర్షాల కారణంగా వాయిదా పడింది. కాగా బుధవారం మూడోసారికి ముడిపడింది. ముందురోజు నుంచి వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తాయో.. లేదోనన్న ఆందోళన మధ్య ఏర్పాట్లు పూర్తి చేయగా.. ఎట్టకేలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సభ సక్సెస్ అయింది.

ముఖ్యమంత్రి పర్యటన.. సైడ్ లైట్స్

- ఇందిరమ్మ గృహాల ప్రారంభోత్సవాల సందర్భంగా పోలీసులు ముందస్తుగా బెండాలపాడు గ్రామాన్ని పూర్తిగా స్వాధీనంలోకి తీసుకున్నారు.
- లబ్ధిదారులందరినీ ఒకేచోట చేర్చి.. సీఎం మాట్లాడే విధంగా ఏర్పాట్లు చేశారు.
- బెండాలపాడు గ్రామంలోకి మీడియాతో సహా ఇతరులు ఎవరినీ అనుమతించలేదు.
- సీఎంను చూసేందుకు జనం హెలీప్యాడ్ పరిసరాలతో పాటు ఆయన వెళ్లే మార్గంలో రోడ్ల వెంట, భవనాల పైకి ఎక్కారు.
- సీఎం ప్రోగ్రాం గంటన్నరకు పైగా ఆలస్యం కావడంతో.. 12 గంటలకే వేదిక వద్దకు చేరిన ప్రజలు మంచి నీళ్లు, ఆహారం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ఉభయ జిల్లాల నలుమూలల నుంచి ఉదయం నుండే సభకు బయలుదేరిన ప్రజలు సీఎం సభ ఆలస్యం కావడం, ఆహారం, మంచి నీళ్లు అందుబాటులో లేకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి సభ వేదికను ఎక్కగానే ఆయన్ను చూసిన జనం సభా ప్రాంగణం నుంచి సభ జరుగుతుండగానే వేలాదిగా జనం బయటకు వెళ్లిపోయారు.
- సీఎం సభ నుంచి జనం వెళ్ల పోతుండంతో పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టి ఆపే ప్రయత్నం చేయగా.. ఉదయం వచ్చాం తిండి తిప్పలు లేవంటూ పోలీసులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- సీఎం పర్యటనకు 1200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.
- సీఎం పర్యటన సందర్భంగా చంద్రుగొండలో భారీగా ట్రాఫిక్ అంతరాయం కలిగింది.
- సీఎం సభావేదికపై ఉన్న సమయంలో బెండాలపాడుకు చెందిన ఐదుగురు మహిళలు ఇందిరమ్మ ఇంటి నమూనాను సీఎంకు అందించారు. ఎస్‌కే షబానా, నంద్యాల లక్ష్మీ ఉమ, కొడెం ఏసుమణి, వాణిశ్రీతోపాటు మరో మహిళ కలిసి రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందించారు.





సభలో గద్దర్ వేషధారి సందడి.. డప్పు కొడుతున్న కళాకారుడు

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

పోక్సో కేసు నమోదు

వైరా, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ఒకటో వార్డులోని పాత ఎక్సైజ్ స్టేషన్‌రోడ్డులో ఒక బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై బుధవారం వైరా పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా.. దుగ్గిరాల రత్తయ్య(40)అనే వ్యక్తి తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న బాలిక ఇంటికి వెళ్లి ద్విచక్రవాహనం తాళం కావాలని అడిగాడు. ఆ సమయంలో ఆమె తండ్రి ఇంట్లో నిద్రిస్తుండగా.. బాలిక ఒంటరిగా ఉండడంతో అతను ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో అతను పారిపోవడానికి ప్రయత్నించాడు. స్థానికుల సహాయంతో తండ్రి అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు వైరా ఎస్ఐ పి.రామారావు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

జ్వరంతో బాలుడి మృతి



వార్షిక్ తేజ (ఫైల్)

కూసుమంచి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలతండాలో నాగేశ్వరరావు- కవిత దంపతుల కుమారుడైన ,దారావత్ వార్షిక్ తేజ (6) జ్వరంతో బుధవారం మృతిచెందాడు. బాలుడు కూసుమంచిలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. ఈ క్రమంలో 20 రోజులుగా బాలుడు జ్వరంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు స్థానికంగా చికిత్స చేయిస్తున్నారు. ఈ మేరకు పరిస్థితి విషమించడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. ఇదిలా ఉండగా స్థానికంగా మరికొందరు జ్వరాలతో బాధపడుతున్నారని, ఈ తండాలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాగర్ కాల్వలో పడి మహిళ...



శిరీష మృతదేహం

ఏన్కూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు సాగర్ కాల్వలో పడి మహిళ మృతి చెం దిన సంఘటన బుధవారం ఉదయం ఏన్కూరులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం బీసీ కాలనీకి చెందిన దుగ్గిరాల శిరీష(24) రోజువారి లాగానే ఉదయం సమయంలో బట్టలు ఉతకడానికి గ్రామ సమీపంలోని కాల్వకి భర్త నాగరాజుతో కలిసి బైక్‌పై వెళ్లింది. అనంతరం భార్య ఎంతకీ ఇంటికి రాకపోవడంతో భర్త ఫోన్‌చేశాడు. ఫోన్ ఎత్తకపోవడంతో అనుమానంతో భర్త ఎన్నెస్పీ కాల్వ దగ్గరికి వెళ్లిచూడగా బట్టలు, సెల్‌ఫోన్ కనిపించాయి. నాగరాజు వెంటనే గ్రామస్థుల సాయంతో కాల్వలో వెతగగా మధ్యాహ్నం 2గంటల సమయం లో రెగ్యులేటర్స్ సమీపంలో శవమైతేలింది. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిషన్ భగీరథ చాంబర్‌లో పడి వ్యక్తి...

చాంబర్‌పై స్లాబ్ లేక పోవడం వలనే ప్రమాదం : ఎంఆర్‌పీఎస్ నాయకులు

కరకగూడెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటిగూడెం గ్రామం ప్రధాన రహదారి పక్కన ఉన్న మిషన్ భగీరథ చాంబర్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కరకగూడెం మండలంలో బుధవారం జరిగింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. హెడ్ కానిస్టేబుల్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వాపురం మండలం మొండికుంట పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన వంగూరి వెంకన్న (48) తాటిగూడెం వద్ద ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం పనుల కోసం వచ్చాడు. మంగళవారం రాత్రి ఇక్కడ ఉంటున్న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తెల్లవారు వరకు రాకపోవడంతో తోటి పనివారు వెతకగా చాంబర్‌లో పడి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు, మృతుని బంధువులకు సమాచారం అందించారు. మృతుడి తమ్ముడు వంగూరి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మణుగూరు ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు స్థల సేకరణ చేయండి

కాజీపేట- విజయవాడ మూడో రైల్వేలైన్‌కు స్థల సేకరణ పూర్తి చేయాలి
వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర కేబినెట్ సెక్రటరీ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట - విజయవాడ రైల్వే మూడో లైన్ ప్రాజెక్ట్ చాలా ప్రాధాన్యత ఉందని, రైళ్ల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, భవిష్యత్‌లో రైల్వేట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా పరిపాలన యంత్రాంగం అన్నివిధాల సహకరించాల్సిన అవసరం ఉందని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతికి కావలసిన స్థలసేకణపై బుధవారం కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ మనోజ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తన క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో కాజీపేట నుంచి విజయవాడ రైల్వే మూడో లైన్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ తుదిదశలో ఉందన్నారు. భూ సేకరణ పూర్తికావడమే ప్రాజెక్ట్ వేగ వంతానికి కీలకమన్నారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, చెన్నై మార్గాల్లో ట్రాఫిక్ తగ్గిపోతుందన్నారు. పరిశ్రమలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు నాటికి పనులు పూర్తి చేసి, ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లాలని, భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. ఈ సమీక్షలో రెవెన్యూ, సర్వే విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

తోగ్గూడెం వద్ద మహిళ...

మణుగూరు, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండలంలోని తోగ్గూడెం ప్రధాన రహదారిపై రోప్‌వే సమీపంలో కారు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పినపాక మండలం ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన కొడిరెక్కల సావిత్రి(54) ఆటోలో బూర్గంపాడుకు బయలుదేరింది. పాల్వంచ నుంచి మణుగూరు వైపుకు వస్తున్న ఓ కారు ఆమె ప్రయాణిస్తున్న ఆటోను తోగ్గూడెం ప్రధాన రహదారిపై ఢీకొట్టింది. ఈ ఘటనలో సావిత్రికి తీవ్ర గాయాలు కావడంతో ఆమెను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. బూర్గంపాడులో ఉన్న ఆమె కోడలు ప్రసవించగా.. కోడలను ఇంటికి తీసుకువచ్చేందుకు బూర్గంపాడుకు బయలు దేరిన సావిత్రి ఇలా రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబంలో తీరని విషాదం చోటు చేసుకుంది. మృతురాలికి భర్త ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పాల్వంచలో యువకుడు...

పాల్వంచ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురంకు చెందిన జర్పుల చరణ్(22) హైదరాబాదులో బీటెక్ పూర్తిచేసి, యూకే వెళ్లడానికి వీసా దరఖాస్తు చేసుకున్నాడు. బుధవారం మహబూబాబాద్‌లో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ ఉండటంతో హైదరాబాద్ నుంచి స్వగ్రామం చేరుకున్నాడు. తనకు ద్విచక్రవాహనం లేకపోవడంతో.. పాల్వంచ వెంగళరావు కాలనీలోని తన స్నేహితుడు పవన్ ఇంటికివచ్చాడు. స్నేహితుడితో కొద్దిసేపు గడిపి, బైక్ తీసుకొని అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో దమ్మపేట సెంటర్‌కు చేరుకున్న అతను సిగ్నల్ ఇవ్వకుండా మలుపుతిరగగా వెనుకనుంచి వచ్చిన టిప్పర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడడంతో తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి జర్పుల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ అడిషనల్ ఎస్ఐ జీవన్‌రాజ్ తెలిపారు.

బాలిక కిడ్నాప్...

పాల్వంచ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలిక (14) కిడ్నాప్‌కు గురైన సంఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం సదరు బాలిక పాల్వంచ మండలం ఉల్వనూరు బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన ఆమెను తల్లి ఆటో ఎక్కించింది. సుమారు 11 గంటల ప్రాంతంలో ఎందుకో అనుమానం వచ్చిన తల్లికి హాస్టల్ సెక్యూరిటీ గార్డుకు ఫోన్‌చేసి ఆరా తీయగా బాలిక రాలేదని తెలిసింది. అనంతరం ఆమె స్వయంగా హాస్టల్‌కు వెళ్లి నిర్ధారణ చేసుకుంది. బాలికను ఎవరో ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని వెళ్లారని గ్రామంలోని ఓ మహిళ చెప్పడంతో తన కుమార్తెను ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కిడ్నాప్ చేసాడని ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు హెచ్‌సీ కృష్ణ తెలిపారు.

టెట్‌పై తీర్పు.. టీచర్లలో గుబులు

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలు పెద్దఎత్తున ఉన్నాయి. ఇదే క్రమంలో సర్టిఫికెట్ల పరిశీలనలోనూ లక్షలాది రూపాయలు చేతులు మారాయి. తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన ఫేక్ సర్టిఫికెట్స్‌తో చాలా మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందారు. గుర్తింపులేని ఓ యూనివర్సిటీ నుంచి రెండు మూడు రోజుల్లో సర్టిఫికెట్లు పొంది చాలా మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. ఒక్కొక్క సర్టిఫికెట్‌కు రూ.10 వేలు చెల్లించి ఫేక్ సర్టిఫికెట్స్ తీసుకొచ్చి పదోన్నతులు తీసుకున్నారు. ఈ విషయమై సీటీసీఐడీ, ఇంటెలిజెన్స్ వర్గాలు విచారణ చేసినప్పటికీ.. కొందరు ఉపాధ్యాయ సంఘ నాయకుల ప్రవేశంతో ఈ కేసు మూలనపడింది. రెగ్యులర్ కోర్సులు చేసిన ఉపాధ్యాయులు ఫేక్ సర్టిఫికెట్స్ హోల్డర్స్‌పై గతంలో కోర్టును సైతం ఆశ్రయించారు. అలాగే ప్రభుత్వం ప్రతీ ఏడాది నిర్వహించే వృత్యాంతర శిక్షణలకు కూడా పలువురు ఉపాధ్యాయులు నామమాత్రంగానే హాజరవుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వం సరఫరా చేసిన వృత్యాంతర శిక్షణ పుస్తకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. కనీసం ఆ పుస్తకాలను ఒక్కసారైనా తిరగేయని టీచర్లు జిల్లావ్యాప్తంగా ఎందరో ఉన్నారంటే.. అతిశయోక్తి కాదనేచెప్పాలి. ఈ నేపథ్యంలో 2012కు ముందు ఉపాధ్యాయులుగా ఉద్యోగం పొందినవారు తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిందేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు జిల్లాలో పలువురు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

కొత్తగూడెం టూ టౌన్‌లో కేసు నమోదు



జైకుమార్ (ఫైల్)

చుంచుపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపంతో ఓ యువకుడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం పట్టణ పరిధిలోని రామవరం పంజాబ్ గడ్డ బస్తీకి చెందిన మైలారపు ప్రసాద్, విజయకుమారి కుటుంబం నివసిస్తుంది. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు జైకుమార్(23) మూడేళ్ళ క్రితం హైదరాబాద్‌కు చెందిన అఖిల భార్గవి అనే యువతిని 2022లో ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. పెళ్లి అనంతరం ఖమ్మంలో ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ జైకుమార్, అఖిల భార్గవిలు అన్యోన్యంగా ఉంటున్నారు. సంవత్సరం క్రితం పుట్టింటికి వెళ్లిన భార్యకు ఫోన్ చేసి రావాలని కోరుతున్నప్పటికీ రావడంలేదు. కాపురానికి రాకపోవడంతో పాటు భర్తపై హైదరాబాద్‌లో ఈ ఏడాది జూలై 20వ తేదీన కేసు పెట్టింది. దీంతో ఆయనపై వరకట్న వేధింపుల కేసు నమోదయింది. ఈమేరకు భార్య, భర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చినా భర్త వద్దకు వెళ్ళనని తేల్చిచెప్పింది. అప్పటినుంచి మనస్తాపానికి గురై భార్యను కాపురానికి రావాలని కోరినా వినలేదు. చివరికి ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు ఆత్మహత్య చేసుకుంటాడని అనుకోలేదని తల్లిదండ్రులు, బంధువుల రోధనలు చూపరులను కలిసివేసింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కొత్తగూడెం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

ఖమ్మంక్రైం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బుధవారం ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసనగర్‌కి చెందిన వీరల్లి వెంకటరావు(49) నగరంలోని ఓ బట్టల షాపులో పనిచేస్తాడు. కొద్దినెలల క్రితం తండ్రి మృతి చెందటంతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆగస్టు 30న ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పాముకాటుతో యువతి..

ఖమ్మంక్రైం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): పాముకాటుతో చికిత్స పొందుతూ ఓ యువతి మృతిచెందిన సంఘటన బుధవారం ఖమ్మం నగరంలో జరిగింది. ఖానాపురంహవేలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రశాంత్ నగర్‌కు చెందిన మునిగంటి పావని(23) గత నెల 23న కిరాణ సరుకులు తెచ్చేందుకు ఓ షాపుకు వెళ్లి వస్తుండగా పాము కాటువేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



పెసర రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

వైరా, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోతకు పనికిరాకుండా పోయిన పెసర పంట రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో వైరా మండల వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం ఎదుట బాధిత రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పెసర పంట ఇటీవల కురిసిన వర్షాలకు కోయకుండా పొలాల్లోనే వదిలేసిన రైతులందరికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఏవో మయాన్ మంజూఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కిలారు శ్రీనివాసరావు, ఆళ్ల రాంబాబు, అమరనేని అప్పారావు, వెంపటి రాజా, రాజేంద్రప్రసాద్, శ్రీరామనేని ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు గ్రామపాలన అధికారులకు
నియామక పత్రాల జారీ

» కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లో సీసీఎల్ఏ లోకేష్ కుమార్



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 5న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లో జీపీవోలకు అందించే నియామక ఉత్తర్వు పత్రాలు పంపిణీ చేయనున్నట్టు సీసీఎల్ఏ కార్యదర్శి లోకేష్ కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ)తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్ లో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. గ్రామపాలనాధికారి పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వు పత్రాలు అందించనున్నట్టు తెలిపారు. అనంతరం ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. జీపీవో అభ్యర్థులకు నియామక పత్రాలు హైదరాబాద్‌లో అందజేయనున్న నేపథ్యంలో అభ్యర్థుల హాజరుకు ఏర్పాట్లు చేయాలన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా జీపీవోల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 307 మందిని హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో నియామక పత్రాలు అందుకోనున్నట్టు తెలిపారు. 6 ప్రత్యేక బస్సుల్లో నిర్ణీత సమయానికి కార్యక్రమానికి తీసుకెళ్లాలన్నారు. 307 మంది గ్రామ పాలనాధికారులకు వారి సొంత మండలంలో కాకుండా ఇతర మండలాలలో నియమించేందుకు గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ ద్వారా ఎంపికైన క్లస్టర్లకు ఉత్తర్వులు ఇస్తామని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమీక్షలో డీఆర్‌వో పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి పరిదిలోని పెద్దతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్ నివారణపై బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్ మాట్లాడుతూ ఈ డిజిటల్ యుగంలో, సైబర్ క్రైమ్ అనేది మనందరిని ప్రభావితం చేసే ఒక పెద్ద ముప్పుగా మారిందన్నారు. ప్రతి వ్యక్తి తనకు తాను, ఇతరులను రక్షించుకోవడానికి సురక్షిత పాస్‌వర్డ్‌లు వాడటం, వ్యక్తిగత సమాచారం పంచకూడదన్నారు. డిజిటల్ ప్రపంచంలో జాగ్రత్త, అవగాహన, బాధ్యతతో వ్యవహరించడం ప్రతి యువత బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నవీబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, కళాశాల డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, ఎస్‌ఐలు రంజిత్ కుమార్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో లంబాడీల సత్తా చాటాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లంబాడీలపై పెద్దకుట్ర జరుగుతుందని, దీనిని ఆపకపోతే త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో లంబాడీల సత్తాచాటుతామని బంజార అడ్వకేట్ జేఏసీ నాయకులు హరినాయక్ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంనగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లంబాడీలు ఎస్టీలు కాదంటూ కొందరు కోర్టులో పిటీషన్ వేశారని, ఇది చెల్లదని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లంబాడీలను అశ్రద్ధ చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. లంబాడీలను అశ్రద్ధ చేస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లో బస్సుయాత్ర చేస్తామన్నారు. ఈవిలేకరుల సమావేశంలో ధరావత్ వీరన్న, దేవేందర్, శ్రీకాంత్, బానోతు తులసిబాయి, చందావత్ నరేంద్రనాయక్, ధరావత్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందేలా చూడాలి: సీపీఎం

కూసుమంచి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సొసైటీల వద్ద, ప్రత్యేక కేంద్రాల వద్ద రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి తోటకూరి రాజు, రైతు మండల అధ్యక్షుడు మల్లెల షన్మతిరావు, మండల కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డిమాండ్‌కు తగినట్లుగా యూరియా తెప్పించకపోవడంతో రైతులు సొసైటీల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆరోపించారు. నిలబడలేక సొమ్మసిల్లుతున్నారని వాపోయా రు. ఒక్కో రైతుకు ఒక్క కట్ట సరిపోదని తెలిపారు. సాగుచేస్తున్న వరి, పత్తి, మిర్చి పంటలకు యూరియా వేయాల్సిన సమయంలో వేయకపోవడం వలన పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వరిపొలాలు ఎర్రబారుతున్నాయని, డిమాండ్‌కు సరిపడా యూరియా తెప్పించాలని, రైతులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో పండరి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ కాలేజీ నిర్మించాలని ధర్నా

తిరుమలాయపాలెం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెంలో ఐటీఐ కాలేజీ నిర్మించాలని కోరుతూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. తిరుమలాయపాలెంలోని సర్వే నెంబరు 254లోగల ప్రభుత్వ భూమిలో కళాశాల నిర్మించాలని కోరుతూ నిరాహారదీక్ష చేపట్టారు. ఈకార్యక్రమంలో కొమ్ము శ్రీను, వెన్నబోయిన రమేష్, దాసరి మహేందర్, కొలిచలం స్వామి, సీహెచ్ నాగభూషణం, కొమ్ము పూలే, పోలెబోయిన ముత్తయ్య, బానోతు రవి, పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన మహిళలు

కామేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చంద్రుగొండ మండలం దామరచర్లలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల మహోత్సవానికి మండలం నుంచి పది బస్సులతో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, డ్వాక్రా మహిళలు, ముఖ్య నాయకుల తరలి వెళ్లారు. మాజీ ఎంపీటీసీ నల్లమోతుల లక్ష్మయ్య, గుజ్జర్లపుడి రాంబాబు, పత్యే మహ్మద్, గోపి తరలివెళ్లారు.

శ్రీ చైతన్య కళాశాలకు ట్రిబుల్ ఏ రేటింగ్

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పొన్నేకల్లు పరిధిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు కెరీర్స్ 360 వారు ట్రిబుల్ ఏ రేటింగ్ ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ ట్రిబుల్ ఏ రేటింగ్ సాధనలో శ్రీ చైతన్య విద్యా ప్రమాణాలు, పరిశోధన, ప్లేస్‌మెంట్ రికార్డ్, పేటెంట్లు, ప్రాజెక్ట్ ఫండింగ్, రీసెర్చ్ గ్రాండ్స్, ఇండస్ట్రీ కలబోరేషన్స్, పబ్లికేషన్లకు సైటేషన్లు వంటి అంశాలపై నిర్వహించిన సర్వేలో మా కళాశాలకు ట్రిబుల్ ఏ ప్లస్ రేటింగ్ వచ్చినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక, డైరెక్టర్ శ్రీ విద్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డాక్టర్ వి.సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, పాలిటెక్నిక్ ఇన్‌చార్జి సీహెచ్. కృష్ణ ప్రసాద్, చిరంజీవి, ప్రణతి, జ్యోతి, శ్రీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డిపో తెరుచుకునేనా..?

» నాలుగేళ్లుగా మూసి ఉన్న వైనం
» కొందరి లాభం కోసమే ఇసుక డిపో మూసేశారంటూ ఆరోపణలు



మూసివేసి ఉన్న టీఎస్ఎండీసీ ఇసుక డిపో

ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ఇసుక ర్యాంపులను అనధికారికంగా నడిపిస్తున్న వారిపై చర్యలు తీసుకోని కొత్తగా జిల్లాలో ఇసుక డిపోలను ఏర్పాటు చేసి వినియోగదారులకు నాణ్యమైన ఇసుకను తక్కువ ధరలకు అమ్ముతుంటే, అందుకు విరుద్ధంగా ఖమ్మంలో ఎప్పటి నుంచో ఉన్న ఇసుక డిపోను సంబంధిత అధికారుల నిర్లక్ష్యమా, లేక కొందరి ఇసుక వ్యాపారుల స్వలాభం కోసమో తెలియదు కాని నాలుగేళ్లుగా ఇసుక డిపోను మూసివేసి ఉంచారు. ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన టీజీఎండీసీ(తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్) ఇసుక డిపో గత నాలుగేళ్లుగా మూతబడింది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ఎంతో ఖరీదైన స్థలం నాలుగేళ్లుగా నిరుపయోగంగా మారింది. దీంతో ఈ ఇసుక డిపో తెరుచుకొనేది ఎప్పుడో తెలియని పరిస్థితి. కొందరు ఇసుక వ్యాపారుల సూచనల మేరకే ఇసుక డిపోలో ఇసుక ధరను మార్కెట్ రేట్ల కంటే అధికంగా పెట్టి ప్రైవేటు వ్యాపారులకు మాత్రం మార్కెట్ ధర కంటే తక్కువగా అందిస్తున్నారన్న విమర్శలు వినవడుతున్నాయి. సొంతింటి నిర్మాణదారులకు తక్కువ ధరకు ఇసుక అందకుండా చేస్తున్న టీజీఎండీసీ అధికారులు. సొంతిల్లు నిర్మించాలనుకునే గృహ నిర్మాణదారులకు ఇసుక తక్కువ ధరకు నాణ్యమైన ఇసుకను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం టీజీఎండీసీ ద్వారా ఖమ్మం నగరంలో టీజీఎండీసీ ఇసుక డిపోను ప్రారంభించింది. కాని అప్పటి టీజీఎండీసీ అధికారులు, కొందరు ఇసుక వ్యాపారుల కారణంగా ఇసుక డిపో పట్టమని మూడునెలలు నడవలేదు. కారణం బహిరంగ మార్కెట్ కంటే ఇసుక ధరను అధికంగా తీసుకోవటంతో ఎవ్వరు రాకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం అధిక ధరకు ఇసుకను అమ్మటమే.

దీంతో ఇసుక డిపో మూత పడటంతో ఇసుక అక్రమార్కులు వారి సొంత డిపోలను ప్రారంభించి అధిక ధరలకు అమ్మడం ప్రారంభించారు. వాస్తవానికి తెలంగాణలో ఎక్కడైనా టీజీఎండీసీ ద్వారానే ఇసుకను కొనుగోలు చేసి అమ్మాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఇసుక డిపోలో అధిక రేటుకు కొన్న ఇసుక ప్రయివేటు వ్యక్తుల వద్ద అదే ఇసుక తక్కువ ధరకు ఎలా వస్తుందో ఆ సంస్థ ఉద్యోగులకే తెలవాలి.

బహిరంగ మార్కెట్ కంటే అధికంగా ధరలు

ఇసుక కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం టీజీఎండీసీ ద్వారా ఇసుక తక్కువ ధరకు అమ్మేందుకు డిపోలను ఏర్పాటు చేసింది. అవసరమైన మేరకు ఇసుకను సరఫరా చేస్తుంది. దీనిలో భాగంగా జిల్లాలో 2018 డిసెంబర్ 31న ఖమ్మం గ్రామీణ ప్రాంతం పోలేపల్లి సమీపంలో ఇసుక డిపో ఏర్పాటు చేశారు. కానీ ఇసుక డిపో ప్రారంభమైన నాటినుంచి ఏనాడు కూడా ఏడాదిలో రెండు నుంచి మూడు నెలలు తీసి ఉన్న పాపాన పోలేదు. అనంతరం 2020 నవంబరులో నగరంలోని నూతన బస్టాండ్ పక్కకు మార్చారు. కొన్నినెలల అనంతరం డిపోను మూసివేశారు.

డిపోలో టన్ను ఇసుక రూ.1,800

డిపోలో ఇసుక డిపో క్యూబిక్ మీటరు రూ.2,100 ఉండేది. దీనికి జీఎస్టీ అదనం. ఒక్కో ట్రాక్టర్‌కు (మూడు క్యూబిక్ మీటర్లకు) రూ.6,700 చెల్లించాలి. ఒక్కో క్యూబిక్ మీటరులో 1.5 టన్ను ఇసుక ఉంటుంది. ట్రాక్టర్లో మూడు క్యూబిక్ మీటర్లు అంటే 4.5 టన్నుల రేటు రూ.6,750 ఉంటుంది. దీనికి ట్రాక్టర్ కిరాయితో కలిపి రూ. 7,500 వరకు విక్రయించేవారు. టన్ను ఇసుక రూ.1,800లు పడుతుంది. బహిరంగ మార్కెట్‌లో టన్ను ఇసుక రూ.1,500లకు దొరుకుతుండడంతో వినియోగదారులు ఇసుక డిపోకు రాని పరిస్థితి ఏర్పడింది. విషయం కొందరు అధికారులకు తెలిసినా ఇసుక అక్రమ వ్యాపారుల నుంచి నెలవారీ మామూళ్లు రాకుండా పోతాయోననే భయంతో ఇసుక డిపోలలో అధిక రేట్లకు అమ్ముతున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. రెండు వేల రూపాయలకు పైగా తేడాతో టీఎస్ఎండీసీ ఇసుక అధిక ధరకు అ మ్మాలని నిర్ణయించడంతో నిర్మాణదారులు డిపో ఇసుకకు కొనేందుకు ముందుకు రావడంలేదు. వర్షాకాలం నదులు, వాగులు పొంగి ఇసుక లభించటం కష్టంగా మారుతుంది. ఈ సమయాల్లో ఎండాకాలం టీజీఎండీసీ ఇసుక డిపోల్లో ఇసుకను ముందుగానే డంప్ చేసి తక్కువ ధరకు ఇంటి నిర్మాణదారులకు అందిచాల్సిన అధికారులు, ఆ దిశగా ప్రయాత్నాలు చేయకుండా ఇసుక కొనేందుకు ఎవ్వరు ముందుకు రావడం లేదనే సాకుతో డిపోలో ఇసుక అందుబాటులో లేకుండా చేస్తున్నరనే వాదనలు వినపడుతున్నాయి.

ఖమ్మం వచ్చిన ఐజీపీ చంద్రశేఖరరెడ్డి



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీపీ చంద్రశేఖరరెడ్డి

ఖమ్మంక్రైం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మల్టీజోన్ వన్ ఐజీపీ ఎస్.చంద్రశేఖరరెడ్డి బుధవారం ఖమ్మం పోలీసు గెస్ట్‌హౌజ్‌కు వచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు కొత్తగూడేనికి ఖమ్మం మీదుగా వెళుతూ ఖమ్మంలోని పోలీసు గెస్ట్‌హౌస్ వద్ద కొద్దిసేపు ఆగారు. ఈసందర్భంగా సీపీ ఐజీపీ చంద్రశేఖరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పోలీసుసిబ్బంది నుంచి చంద్రశేఖరరెడ్డి గౌరవ వందనం స్వీకరించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

» జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్



ఖమ్మం లీగల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల రెండో శనివారం జరగనున్న జాతీయ మరియు రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థల ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఈనెల 13న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న శనివారం రోజున నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్, సివిల్ కుటుంబ కలహాలతో పాటు మనోవర్తి, విడాకుల కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, బ్యాంకు, చిట్‌ఫండ్, మద్యపాన ఆబ్కారి కేసులు, ఎలక్ట్రిసిటీ సంబంధించిన కేసులతోపాటు రాజీపడదగిన అన్నిరకాల కేసులు పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కనుక ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులు కోర్టులో పెండింగ్‌లో ఉన్న తమ కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించుకొని లోక్ అదాలత్‌ను విజవంతంచేయాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి సెప్టెంబరు 1 నుంచి ముందస్తు లోక్ అదాలత్‌ను న్యాయ సేవాధికారసంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో ప్రారంభించామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకొని ఎక్కువ కేసుల పరిష్కారానికి సహకరించాలని న్యాయవాదులు, చిట్‌ఫండ్ సంస్థలు, బ్యాంకు అధికారులు జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

రూ.18వేల చోరీ

తిరుమలాయపాలెం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతర్లపాడు స్టేజీవద్ద భాగ్యలక్ష్మి కాటన్ మిల్‌పక్కన గల రాజస్థాన్ దాబానందు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి రూ.18వేల నగదును ఎత్తుకెళ్లారు. గుజరాత్‌కు చెందిన లారీ కడియం నుంచి గుజరాత్‌కు మొక్కల లోడుతో వెళుతుండగా కొక్కిరేణి స్టేజీ సమీపంలోకి రాగానే ఖమ్మం వైపు నుంచి ఆటోలో నలుగురు వచ్చి లారీని ఆపి లారీడ్రైవర్ దిలీప్ ముచ్చార్, సురేందర్ ముచ్చార్‌లపై దాడిచేసి రూ.8వేలు ఎత్తుకెళ్లారు. అనంతరం భాగ్యలక్ష్మికాటన్ మిల్‌వద్ద లారీడ్రైవర్లు ఉండగా మళ్లీ అదే వ్యక్తులు వచ్చి రాజస్థాన్ దాబా నిర్వాహకులు రుస్తుంఖాన్‌పై దాడిచేసి డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని బెదిరించి రూ.10వేలు ఫోన్‌పే చేయించుకున్నారు. అక్కడి నుంచి ఉడాయించారు. ఈమేరకు దాబా నిర్వాహకులు రుస్తుంఖాన్ ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

పంచాయతీ
కార్యదర్శిపై ఫిర్యాదు

తిరుమలాయపాలెం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ సదరు ఉద్యోగులకు, ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన పంచాయతీ కార్యదర్శి కార్మికులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితులు బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని బచ్చోడు తండా పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న విద్యాసాగర్ తమను వేధింపులకు గురిచేస్తున్నారని పంచాయతీ వర్కర్లు గుగులోతు విజయ, గుగులోత్ సరోజ, గుగులోత్ నరేష్ ఫిర్యాదు చేశారు. తాము 9నెలల క్రితం నుంచి పంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్నామని, ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.4వేలు ఇస్తే పర్మినెంట్ చేస్తామని చెప్పి మొత్తం రూ.12వేలు వసూలు చేశారని ఫిర్యాదులో తెలిపారు. తాము 8నెలలుగా కష్టపడిన జీతం ఇవ్వడంలేదని వాపోయారు. అంతేకాకుండా నాతో కలిసి అశ్లీల వీడియోలు చూడాలని వేధిస్తూ మాతో పనిచేస్తున్న గుగులోత్ నరేష్‌ను నువ్వు ట్రాన్స్‌జెండర్‌గా మారితే ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని నిత్యం వేధిస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. జీతాలు ఇవ్వాలని అడగ్గా దుర్భాషలాడాడని వాపోయారు. తమకు న్యాయం చేయాలని బాధితులు తెలిపారు.

యూరియా కొరత.. రైతన్న చింత

(5వ పేజీ తరువాయి)

సద్దుమణిగేలా చేశారు. మండల వ్యవసాయాధికారి రాధ యూరియా సక్రమంగా పంపిణీ జరిగేలా చూశారు. కూసుమంచి మండలంలో బుధవారం సొసైటీలతో పాటు కొత్తగా 34 సబ్‌సెంటర్లు ఏర్పాటుచేసి యూరియా పంపిణీ చేశారు. ఒక్కో కేంద్రానికి కేవలం 110 బస్తాలు మాత్రమే రావడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. తెల్లవారుజామున 5గంటలనుంచే బారులు దీరారు. ఉదయం 9గంటలైనా కొన్ని గ్రామాల్లో వస్తాయన్న 110 బస్తాలు రాకపోవడంతో టోకెన్లు తీసుకుని గ్రామపంచాయతీ ఎదుట పడిగాపులు కాసారు. ఒక్కో రైతుకు ఒక్క బస్తా మాత్రమే ఇవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 110 కూపన్లు అయిపోయాక మిగిలిన రైతులను రేపు తీసుకెళ్లాలని సర్దిచెప్పారు. యూరియా బస్తాలు తక్కువగా ఉండటంతో రైతులు వరుసలో ముందు నిలబడటానికి పోటీలు పడ్డారు. తోపులాటకు దిగారు. ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి యూరియా పంపిణీని పర్యవేక్షించారు. సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు సిబ్బందితో యూరియా పంపిణీకి బందోబస్తు నిర్వహించారు. ఇక భద్రాద్రికొత్తగూడెం జిల్లా జూలూరుపాడు సొసైటీలో రైతులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో రైతు లు, సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ కలసి సిబ్బందిని కార్యాలయంలో నిర్బంధించి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని తలుపులు తీసి రైతులు, సిబ్బందితో చర్చించారు. రైతులకినచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. అలాగే ఆళ్లపల్లి మండలంలోని రైతులు, అఖిలపక్ష నాయకులు యూరియా కోసం బుధవారం శెలగట్టు వద్ద రోడ్డుపై రాస్తోరోకో చేశారు. తక్షణం పంటల ఆధారంగా ప్రతి రైతుకు సరపడ యూరియా అందించాలని డిమాండ్ చేశారు. కాగా కొందరు కాంగ్రెస్ నాయకులు రైతుల తరుపున ప్రభుత్వతీరుపై పాల్గొనడం గమానార్హం.

తిరుమలాయపాలెం: మండలంలోని వివిధగ్రామాల్లో యూరియా కోసం రైతులకోసం బారులు తీరారు. మండలంలోని కాకరవాయి, పైనంపల్లి, సుబ్లేడు, బచ్చోడు, తిరుమలాయపాలెం, హైదరసాయిపేట, జల్లేపల్లి, పిండిప్రోలు, పాతర్లపాడు తదితర గ్రామాల్లో రైతులు తెల్లవారుజామునుంచే బారులు తీరారు. రెండుగంటలపాటు వేచి ఉన్నా రైతులకు యూరియా అందలేదు. పోలీసుల సాయంతో రైతులకు యూరియా పంపిణీ చేశారు.



మూటాపురం సొసైటీలో యూరియా పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీవో నర్సింహారావు



కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో బారులుదీరిన రైతుల

ప్రశాంతంగా రైతులకు యూరియా అందజేత

ఖమ్మం రూరల్: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలో గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన సెంటర్ల ద్వారా రైతులకు బుధవారం యూరియా కట్టలు అందజేశారు. మొత్తం 880 యూరియా కట్టలు రాగా వాటిని రైతులకు ఇబ్బందులు లేకుండా పైలెట్ ప్రోగ్రాం లా రైతులకు అందజేశారు. రైతులకు రవాణా ఖర్చు లేకుండా సెంటర్ల ద్వారా రైతులకు ఇబ్బంది లేకుండా లైన్లలో నిలబడకుండా అందించాలని మంత్రి పొంగులేటి ఇటీవల అధికారులను ఆదేశించారు. తీర్థాల, పల్లెగూడెం, ఎమ్‌వి పాలెం, గుదిమల్ల, తల్లంపాడు, మద్దులపల్లి, బారుగూడెం, ముత్తగూడెం గ్రామాల్లో సెంటర్లు ఏర్పాటు చేసి రైతులకు అందజేశారు. ఒక్కో రైతు పట్టాదారు పాసు పుస్తకానికి ఒక్కో యూరియా కట్ట చొప్పున అందజేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ రాంప్రసాద్, ఏవో ఉమానగేష్, సొసైటీ సీఈవో అలీ తదితరులు పరిశీలించారు.

వేడుకగా గణేష్ నవరాత్రులు



విజయనగర్‌కాలనీ-2లో...

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణే ష్ నవరాత్రులలో భాగంగా గణేష్ మండపాల వద్ద అన్నదానాలు, తోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఇందిరానగర్‌లోని బాలగణపతి ఆలయంలో ప్రతిష్ఠించిన గణేష్ మండపంలో గణేష్ మహరాజ్‌కు గరికతో పూజ నిర్వమించారు. ఆలయ అర్చకుడు గిరిధర్, ఈవో నరసింహారావు ఆధ్వర్యంలో గరిక పూజ నిర్వహించారు. జయనగర్ గణేష్ మండప కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు వివిధ రకాల నైవేద్యాలను స్వామికి నైవేద్యంగా సమర్పించారు. గణేష్ మండపాల వద్ద అన్నదానాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. నగరంలోని పలు ప్రాంతాలలో ప్రతిష్ఠించిన గణేష్ మండపాల వద్ద అన్నదానాలు నిర్వహించారు.



ఇందిరానగర్‌లో గరికతో పూజలు నిర్వహించిన భక్తులు



ఖమ్మం రూరల్ మండలం శాబాదు మైసిరెడ్డినగర్‌లో గణేష్ మండపం వద్ద కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



42వ డివిజన్‌లో సంఘమిత్ర యూత్ ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద స్వాములకు భిక్ష నిర్వహిస్తున్న దృశ్యం



నేలకొండపల్లిలో..

సీఎస్‌సీ నిర్వాహకుడి దందా!

» రెవెన్యూ ధ్రువపత్రాలకు రేట్లు నిర్ణయించి మరీ వసూళ్లు


పెనుబల్లి రెవెన్యూ కార్యాలయం


కారాయిగూడెంలో మీసేవ కేంద్రం

పెనుబల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారాయిగూడెం మీసేవ కేంద్రం అడ్డాగా సీఎస్‌సీ నిర్వాహకుడు రెవెన్యూ కార్యాలయంలో ధ్రువపత్రాలు ఇప్పిస్తానని భారీగా నగదు వసూళ్లు చేపడుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. కారాయిగూడెం మీసేవ కేంద్రం నిర్వాహకురాలు అనారోగ్యంతో కొన్నేళ్లుగా కేంద్రాన్ని నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో అదే కేంద్రంలో కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ఏర్పాటుచేసుకున్న నిర్వాహకుడు ఆహారభద్రతా కార్డులు, ఇతర ధ్రువపత్రాలు ఆన్‌లైన్ చేసే సమయంలో లబ్ధిదారుల నెంబర్లను సేకరించి అనంతరం వారికి ఫోన్లు చేసి పెనుబల్లి రెవెన్యూ కార్యాలయంలో పనులు చేయిస్తానని డబ్బులు వసూలు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. కొంతకాలంగా రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో మిలాఖత్ అయి రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు భారీ ఎత్తున వసూలు చేసి కార్యాలయంలోని అప్పట్లో అధికారులతో వ్యవహారం నడిపించిన నిర్వాహకుడు ప్రస్తుతం కొత్తగా వచ్చిన అటెండర్ ద్వారా కంప్యూటర్ పనులు కూడా చేయిస్తూ ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని లబ్ధిదారులు వాపోతున్నారు. రేషన్‌కార్డుల మంజూరుకు రూ.ఐదారు వేలు వసూలు చేసి గతంలో గిర్దావర్ వద్ద పని చేసిన అటెండర్ ద్వారానే పనులు చక్కబెడుతూ కార్డులు మంజూరు చేస్తున్నాడని మండలంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. మీసేవ కేంద్రానికి రేషన్‌కార్డు దరఖాస్తు కోసం వెళ్లిన లబ్ధిదారులను టార్గెట్ చేసుకుని తానే ఇప్పిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేయడం జరుగుతోంది. రెండునెలల క్రితం ఈ నిర్వాహకుడు చేసిన వ్యవహారం వల్లనే మండలంలోని ఇద్దరు గిర్దావర్‌పై ఒకేసారి జిల్లా అధికారులు బదిలీ వేటు వేశారు. సీఎస్‌సీ నిర్వాహకుడు రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగిగా చెలామణి అవుతూ హల్‌చల్ చేస్తున్నాడని దానివల్లే అతని ద్వారా పనులు జరుగుతున్నాయని భావించి అతడికి డబ్బులు ఇస్తున్నామని పలువురు పేర్కొంటున్నారు. సదరు సీఎస్‌సీ నిర్వాహకుడు గతంలో రెవెన్యూ కార్యాలయంలో చేసిన పనుల వల్లే కార్యాలయంలో భారీ ఎత్తున అవినీతి జరిగినట్లు కూడా ప్రచారం జరిగింది. ప్రస్తుతం రేషన్‌కార్డుల్లో పేర్లు చేర్పులు, మార్పులకు కూడా రూ.ఐదువేలు డిమాండ్ చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పెనుబల్లి మండలంలో ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం 1620దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి ఉన్నతాధికారులకు పంపించామని, చేర్పులు, మార్పుల కోసం 3412దరఖాస్తులు వచ్చాయని వాటిని కూడా పరిష్కరించమనణ, కొత్తగా 322దరఖాస్తులు రాగా వాటిని పరిశీలిస్తున్నామని తహసీల్దార్ నారాయణమూర్తి తెలిపారు. కార్యాలయంలో పనులు చేపిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని, ఫిర్యాదులు రుజువైతే మీసేవ కేంద్రం రద్దుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని ఆయన తెలిపారు.

యూరియా కొరత.. రైతన్న చింత

(5వ పేజీ తరువాయి)

సద్దుమణిగేలా చేశారు. మండల వ్యవసాయాధికారి రాధ యూరియా సక్రమంగా పంపిణీ జరిగేలా చూశారు. కూసుమంచి మండలంలో బుధవారం సొసైటీలతో పాటు కొత్తగా 34 సబ్‌సెంటర్లు ఏర్పాటుచేసి యూరియా పంపిణీ చేశారు. ఒక్కో కేంద్రానికి కేవలం 110 బస్తాలు మాత్రమే రావడంతో రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. తెల్లవారుజామున 5గంటలనుంచే బారులు దీరారు. ఉదయం 9గంటలైనా కొన్ని గ్రామాల్లో వస్తాయన్న 110 బస్తాలు రాకపోవడంతో టోకెన్లు తీసుకుని గ్రామపంచాయతీ ఎదుట పడిగాపులు కాసారు. ఒక్కో రైతుకు ఒక్క బస్తా మాత్రమే ఇవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 110 కూపన్లు అయిపోయాక మిగిలిన రైతులను రేపు తీసుకెళ్లాలని సర్దిచెప్పారు. యూరియా బస్తాలు తక్కువగా ఉండటంతో రైతులు వరుసలో ముందు నిలబడటానికి పోటీలు పడ్డారు. తోపులాటకు దిగారు. ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి యూరియా పంపిణీని పర్యవేక్షించారు. సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు సిబ్బందితో యూరియా పంపిణీకి బందోబస్తు నిర్వహించారు. ఇక భద్రాద్రికొత్తగూడెం జిల్లా జూలూరుపాడులోని సొసైటీ కార్యలయం ఎదుట బుధవారం రైతులు ఆందోళన చేపట్టారు. యూరియాను పొందేందుకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తెల్లవారుజామునే సొసైటీ వద్దకు చేరుకుని చెప్పులను క్యూలైనులో పెట్టి నిరీక్షించారు. 225 యూరియా కట్టలే అందుబాటులో ఉన్నాయని అక్కడి సిబ్బంది రైతులకు తెలపడంతో.. తాము 10రోజులుగా వ్యవసాయ పనులను మానుకోని యూరియా కోసం వస్తున్నామని, ఒక కట్ట ఇస్తే ఎలా సరిపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో రైతుకు రెండు కట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ రైతులు అధిక సంఖ్యలో రావడంతో రెండు కట్టలు ఇవ్వడం కుదరదని, ఒక్కటి మాత్రమే ఇవ్వగలమని స్పష్టంచేయడంతో రైతులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో రైతులు, సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ కలసి సిబ్బందిని కార్యాలయంలో నిర్బంధించి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని తలుపులు తీసి రైతులు, సిబ్బందితో చర్చించారు. రైతులకినచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. అలాగే ఆళ్లపల్లి మండలంలోని రైతులు, అఖిలపక్ష నాయకులు యూరియా కోసం బుధవారం శెలగట్టు వద్ద రోడ్డుపై రాస్తోరోకో చేశారు. కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మండల పరిధిలో శెలగట్టు వద్ద ఏర్పాటు చేసిన యూరియా గోదాం వద్ద రైతులు వివిధ పార్టీల నాయకులు రోడ్డెక్కి ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందిచండం లేదని, ప్రతిరోజు తెల్లవారుజామునుంచి యూరియా కోసం పడిగాపులు కాస్తున్నా ఒకటి రెండు కట్టలతో కాలం వెళ్లదీస్తున్నామని రైతులను ఇబ్బందులకు గురిస్తున్నారని, ప్రతీ రోజు రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వంలో చలనం రావడంలేదని ఆగ్రహించారు.

తక్షణం పంటల ఆదారంగా యూరియా అందించాలని డిమాండ్ చేస్తు రాస్తారోకో చేశారు.

నాగరత్నంకు నాయకుల నివాళి

కారేపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పురం నారాయణ సతీమణి పురం నాగరత్నం ఇటీవల మృతి చెందారు. బుధవారం ఆమె దశదిన ఖర్మలు జరిగాయి. కార్యక్రమానికి సీనియర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు వైరా వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ గుమ్మ రోషయ్య, సూరపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అనివార్యమైతే ఉద్యమానికి సమాయత్తం

» సత్తుపల్లి యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం


ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గం

సత్తుపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సాచివేత ధోరణిని గమనిస్తున్నామని, అనివార్యమైతే విశ్రాంత ఉద్యోగులుగా ఉద్యమానికి సమాయత్తంగా ఉన్నామని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష్య,కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, సుబ్బయ్య అన్నారు. బుధవారం సత్తుపల్లిలోని సంఘ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి తమకు రావాల్సిన డబ్బుల కోసం ఆవేదనతో ఎదురు చూస్తున్నామని, మంగళవారం హైదరాబాద్‌లో ప్రభుత్వం జరిపిన చర్చలతో ఎలాంటి ప్రయోజనం కలగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం మూడేళ్లకో సారి ప్రతిష్టాత్మకంగా జరిగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సత్తుపల్లి యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్ష,కార్యదర్శులుగా కేశవరెడ్డి, సూర్యప్రకాశరావు, ఆర్థిక కార్యదర్శిగా జీ.కృష్ణయ్య, సహాధ్యక్షులుగా సాంబశివరెడ్డి, నర్సయ్య, ప్రచార కార్యదర్శిగా మధుసూదనరాజు, జిల్లా కౌన్సిలర్లుగా యోగానందం, కమలకుమారి, మహబూబ్ నియమితులవ్వాగాకృష్ణయ్య, రఘుపతిరెడ్డిలు ఎన్నికల అధికారులుగా ప్రమాణస్వీకారం చేయించారు. బద్రుద్దీన్, అద్దంకి వెంకటరత్నం, రామిశెట్టి సుబ్బారావు, బీవీ.రామారావు, సరోజిని, సూరా సత్యనారాయణ, మాధవరెడ్డి, రత్తయ్య, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పెసర రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

» రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వైరా, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోతకు పనికిరాకుండా పోయిన పెసర పంట రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా మండల వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం ముందు బాధిత రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పెసర పంట ఇటీవల కురిసిన వర్షాలకు కోయకుండా పొలాల్లోనే వదిలేసిన రైతులందరికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఏవో మయాన్ మంజూఖాన్‌కు ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. జిల్లాలో జరిగిన పంట నష్టానికి ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పెసర పంట కోతకు పనికిరాకుండా పోయిందని, ఒక్క వైరా నియోజకవర్గ పరిధిలోనే వెయ్యి ఎకరాల్లో పెసర పంటను రైతులు పొలాల్లో వదిలేశారని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో పత్తి మరికొన్ని చోట్ల వరిపొలాలు దెబ్బతిన్నాయని అందువల్ల వ్యవసాయ అధికారులు సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం నాయకులు కిలారు శ్రీనివాసరావు, ఆళ్ల రాంబాబు, అమరనేని అప్పారావు, వెంపటి రాజా, రాజేంద్రప్రసాద్, శ్రీరామనేని ప్రసాద్, కంచర్ల శ్రీనివాసరావు, గోవర్ధన్ పాల్గొన్నారు.

మోడల్ సోలార్ విలేజ్ స్కీంపై అవగాహన

కొణిజర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపికైన తనికెళ్ల, కొణిజర్ల గ్రామాల్లో బుధవారం మోడల్ సోలార్ విలేజ్ పథకంపై విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ పెద్దగోపతి ఏడీఈ తిలక్ మాట్లాడుతూ.. సోలార్ వల్ల అనేక ఉపయోగాలున్నాయని, ప్రజలే సోలార్‌ను ఉపయోగించుకోవడం వల్ల మిగుల విద్యుత్ ఇవ్వవచ్చని తెలిపారు. ప్రతి 5వేల జనాభా ఉన్న గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపిక చేయడం జరుగిందని, అందులో భాగంగానే జిల్లాలో కొణిజర్ల మండలంలోని కొణిజర్ల, తనికెళ్ల గ్రామాలు మోడల్ సోలార్ గ్రామంగా ఎంపిక చేశారన్నారు. రైతులు గాని ప్రజలందరు సోలార్‌ను సద్వినియోగించుకోవాలన్నారు. సోలార్ గురించి వివరించేందకు తమ శాఖ ఎప్పుడు సిద్ధంగానే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దగోపతి ఏఈ రాయల సురేష్, సోలార్ జిల్లా మేనేజర్ అజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, ప్రజాప్రతినిదులు, ప్రజలు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన భూములను కాపాడండి

ఎర్రుపాలెం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం గ్రామంలో అన్యాక్రాంతమైన అసైన్డు భూములను కాపాడాలని గ్రామస్థులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. జమలాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబరు 9లో గల నిరుపేదలకు ప్రభుత్వం గతంలో అసైన్డ్ పట్టాలు పంచింది. ఈ భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారని, అటవీశాఖ స్వాధీనంలో ఉన్న భూములను విడగొట్టి భూములను అప్పగించాలని విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 ఏళ్ల క్రితం వరకు ఆ భూముల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నిరపేదలు సాగు చేసుకున్నారని తెలిపారు. కొందరు దుండగులు అటవీ భూముల్లో కాపుసారా బట్టీలను నిర్వహించారని, తయారీ అనంతరం సదరు సారా కుండలను, డబ్బాలను సాగుభూముల్లో పడేసిపోయేవారని తెలిపారు. ఎక్సైజ్, పోలీసుశాఖ వారు దాడులు నిమిత్తం సాగుభూముల రైతులను బాధించేవారన్నారు. విచారణ పేరుతో పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగలేక సాగుకోసం పొలాల్లోకిపోలేదని తెలిపారు. అంతేకాక స్మశానవాటిక పక్కనే ఉండడంతో ఒంటరిగా సాగుచేయలేక భూములకు దూరంగా ఉండాల్సి వచ్చిందని వాపోయారు చుట్టు అటవీ ప్రాంతం కావడంతో జంతుభయం అప్పట్లో కొన్ని అవాంఛనీయ సంఘటనలు నేపథ్యంలో ప్రాణభయంతో భూములకు అసైన్డు లబ్ధిదారులు దూరంగా ఉన్నారని, తర్వాత తరం వ్యవసాయానికి దూరంగా ఉన్నారని తెలిపారు. ఈకారణంగానే భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. పర్యాటక అభివృద్ధికి తాము వ్యతిరేకంకాదని, కేవలం అటవీ భూముల్లోనే పర్యాటకాన్ని అభివృద్ధి చేసుకోవాలని, అభివృద్ధి పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకోవడం దుర్మార్గమన్నారు. ఉద్దేశపూర్వకంగానే కొందరుఅ టవీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకునే వరకు న్యాయపోరాటం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో అసైన్డు పట్టా రైతులు పాల్గొన్నారు.

వినాయకునికి పూజలు చేసిన ఎమ్మెల్యే


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

వైరా, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ నాల్గోవార్డు ఫిషరీస్ కాలనీలో ఉన్న వినాయక విగ్రహానికి వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు కట్ల రంగారావు, నూతి సత్యనారాయణలతో కలిసి వారు పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, నాయకులు ఖమ్మం మీరా, పమ్మి అశోక్, బోళ్ల గంగారావు, కట్ల నవీన్, ప్రసాద్, బీబాసాహెబ్, షేక్.మున్నా, చరణ్, గణేష్ పాల్గొన్నారు. అలాగే లీలాసుందరయ్యనగర్‌లోని గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎస్ఐ పి.రామారావు, పలువురు నాయకులు ప్రారంభించారు. స్థానిక శాంతినగర్ ఎస్టీ కాలనీలో అన్నదాన కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు ప్రారంభించారు.

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం వివిధ ప్రాంతాల్లో గల వినాయక మండపాల్లో అన్నదానాలు, కుంకుమార్చనలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్ హాజరై గణేష్ ఉత్సవ కమిటీల వద్ద స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి అన్నదానం ప్రారంభించారు.

తల్లాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గణేష్ ఉత్సవాల సందర్భంగా బుధవారం వివిధ గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తమిట్టపల్లి గ్రామంలో డీసీఎంఎస్ మాజీచైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు జ్ఞాపకార్థం కుమారుడు రాయల రేవంత్-డయాన దంపతులు ఆర్థికసహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని శేషగిరిరావు సతీమణి పద్మావతి ప్రారంభించారు. నిర్వాహకులు దేవభక్తిని రాజారావు, నారికొండ శ్రీనివాసరావు, వాసు పాల్గొన్నారు.

వర్షానికి నేలమట్టమైన ఇంటి గోడ

బోనకల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు బోనకల్ ఎస్సీ కాలనీలోని అంతోటి మాణిక్యమ్మ పూరింటి మట్టి గోడ బుధవారం నేలమట్టమైంది. వర్షపు నీళ్లు ఇంటిలోనే ఆగడంతో కొన్ని రోజులుగా మట్టి గోడలు నానాయి. ఇంట్లో ఉండగానే గోడ కూలగా తృటిలో ప్రమాదం తప్పింది. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ఎదురు చూసినా, తమకు ఇళ్లు రాకపోవడం నిరాశ కలిగించిందని మాణిక్యమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్బందులతో పూరి గుడిసెలో జీవనం సాగిస్తున్న తమకు ఇంటి కూలడంతో నివాసం లేకుండా పోయిందని వాపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు ఇళ్లు మంజూరు చేయాలని వేడుకుంటుంది.

ఇందిరమ్మ గ్రామ కమిటీని రద్దు చేయాలి

మధిర రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం రాయపట్నం గ్రామంలో అర్హులందరికి ఇళ్లు రాలేదని, ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం డివిజన్ నాయకుడు పాపినేని రాంనర్సయ్య డిమాండ్ చేశారు. బుధవారం రాయపట్నం గ్రామస్థులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో రెవెన్యూ, మండలపరిషత్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయపట్నం గ్రామంలో అర్హత లేని వారికి ఇల్లు కేటాయించారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లుకువినతిపత్రం అందజేశారు. నాయకులు వెంకట్రావ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు తొలగించవద్దని వినతి

చింతకాని, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చింతకాని, కొణిజర్ల మండలాల్లో విద్యుత్ స్తంబాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని విద్యుత్‌శాఖ వారు తమను వేదిస్తున్నారని కేబుల్ ఆపరేటర్లు బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని వినతిపత్రాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లుకు అందజేశారు. తాము గత 15 ఏళ్లుగా పోల్ ట్యాక్స్ కడుతూ కేబుల్, నెట్ సర్వీసు ఇస్తున్నామని తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారులు కక్ష్యసాదింపు ధోరణీలో కేబుల్ వైర్లను తొలగించాలని వత్తిడి చేయడం తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆపరేటర్లు కోరారు. ఆపరేటర్లు సురేష్‌బాబు, శ్రీనివాసరావు, శ్రీనాద్, వెంకయ్య, కృష్ణారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'వెల్ఫేర్ బోర్డు నిధుల మళ్లింపు'

ముదిగొండ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ వర్కర్స్ కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రభుత్వం కార్మికులకు అందకుండా ఆ నిధులను పక్కదారి మళ్లించిందని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డోనోజు లక్ష్మయ్య చారి ఆరోపించారు. బుధవారం స్థానిక మచ్చా వీరయ్య భవనంలో నారోజు ఈశ్వరచారి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈనెల 10న ముదిగొండ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఐదో మండల మహాసభ జరుగుతుందని ఈ మహాసభకు మండలంలోని బిల్డింగ్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ మండల కన్వీనర్ టీఎస్.కల్యాణ్, నాయకులు ఇరుకు నాగేశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు చట్టుబోయిన వెంకటేశ్వరరావు, నారోజు బ్రహ్మచారి, శ్రీను పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి

తల్లాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం తల్లాడలోని డీసీసీబీ బ్రాంచిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు కార్యకలాపాలు గురించి మేనేజర్ కవితను అడిగి తెలుసుకున్నారు. ఖాతాదారులు, రైతుల సమస్యలను పెండింగ్ లేకుండా తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. డీసీసీబీ చైర్మన్‌ను బ్యాంకు అధికారులు సన్మానించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ ఉష, సూపర్‌వైజర్ ప్రభాకర్, ఎఫ్ఎల్‌సీ బాల మురళీమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాట్యమండలి సభను జయప్రదం చేయాలి

పెనుబల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15వతేదీన పెనుబల్లిలో జరిగే ప్రజానాట్యమండలి మండల సహాభను జయప్రదం చేయాలని సత్తుపల్లి డివిజన్ ఆ సంఘం అధ్యక్షుడు కండే సత్యం బుధవారం పెనుబల్లిలో జరిగాన సమావేశంలో కోరారు. కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని, హక్కులను కాపాడుకొనేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరముందని, తెలంగాణ ఉద్యమసమయంలో కళాకారుల పాత్ర కీలకమైందన్నారు. ఈనెల 15వతేదీన జరిగే పెనుబల్లి మండల మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో డివిజన్ నాయకులు పడిగడపు రాములు, కొల్లి అబ్రహం, మర్రి రజిని, కృష్ణవేణి, యశోద పాల్గొన్నారు.

ఆశ్రమ టీచర్లకు పదోన్నతులు కల్పించాలి

ఏన్కూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్ల పోస్టులకు పదోన్నతులు వెంటనే కల్పించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వెంగళరావు ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. బుధవారం పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే గిరిజన సంక్షేమ అన్ని కేడర్ల ఉపాధ్యాయులకు పదోన్నతులు కలిపించాలని కోరారు. అసబంద్ధత జీవో నెంబరు 25ను సవరించాలన్నారు. ఈ జీవోలో 11మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు60మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులుండడం సరైందికాదన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి

బోనకల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్థికేతర సమస్యలను ముందుగా తాము పరిష్కరిస్తామని భట్టి హామి ఇచ్చినట్లు పేర్కొన్నారు. నాయకులు యాదగిరి, సహదేవ్, జానకీరామ్, మహేందర్ పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్లకు రూ.10 లక్షల బీమా

కల్లూరు, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులైన ప్రతి ఒక్కరితోపాటుగా ప్రైవేట్ ఎలక్ట్రిషన్లకు కార్మిక శాఖ ద్వారా అందిస్తున్న ప్రమాద భీమాను రూ.10 లక్షలకు ప్రభుత్వం పెంచాలని ప్రైవేట్ ఎలక్ట్రిషన్ల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జడల అంజయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కల్లూరు పట్టణంలో ఎలక్ట్రిషన్ల తొమ్మిదవవార్షికోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎంతో ప్రమాదకరమైన విద్యుత్ రంగాన్ని ఆసార చేసుకుని రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని లక్షల మంది కార్మికులు తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. ప్రమాదాలకు గురైన కుటుంబాలకు ఆదుకోవటానికి రూ.10 లక్షలతో పాటుగా వితంతువుగా మారిన మహిళలకు రూ.5వేలు పెన్షన్ మంజూరు చేయాలిని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన ప్రతి ఎలక్ట్రిషన్‌కు బ్యాంకు లింకేజీ సంబంధం లేకుండా కార్మిక శాఖ ద్వారా సగం సబ్సీడీతో రూ. 1 లక్ష రుణ సౌకర్యం అందించాలని కోరారు. కల్లూరు విద్యుత్ శాఖ ఏఈ వెంకట్ మాట్లాడుతూ త్రిఫేస్ విద్యుత్ వైరింగ్‌లో లోడు సమానంగా మూడు ఫేస్‌లకు అందేలా వైరింగ్ చేస్తూ విద్యుత్ వృధాను అరికట్టేలా చూడాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు, ఉపాధ్యక్షుడు వీరబాబు, ప్రధాన కార్యదర్శి యస్‌కె ఖాసీం ఫరీఫ్, మీర్జా కమల్‌షాబేగ్‌పాల్గొన్నారు.

చిరునోములలో బైక్ చోరీ

బోనకల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామంలో బుధవారం బైక్ చోరికి గురైంది. గ్రామానికి చెందిన కరివేద పిచ్చయ్య మంగళవారం రాత్రి సమయంలో తన కారుతో పాటు బైక్‌ను ఇంటి ముందు ఉంచాడు. తెల్లవారిన తరువాత చూడగా బైక్ కనిపించలేదు. స్థానిక పోలీస్ స్టేషన్లో బాదితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి. వెంకన్న కేసు నమోదు చసి దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు


మరమ్మతులకు ముందు, తర్వాత

వైరా, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరా-నెమలి రూట్లో ఎట్టకేలకు పాత పినపాక క్రాస్‌రోడ్డు-సిరిపురం గ్రామాల మధ్యనున్న ఆర్‌అండ్‌బీ రోడ్డులో భారీ గుంతలకు బుధవారం తాత్కాలిక మరమ్మతులు చేశారు. 'ఇది ఆర్‌అండ్‌బీ రోడ్డేనా' అనే శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ఒక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దాదాపు మూడు అడుగులపైగా లోతులో గుంతలేర్పడి వాహనచోదకులకు నరకప్రాయమైంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే టిప్పర్లు ఇతర భారీ వాహనాలు సామర్థ్యానికి మించిన బరువుతో తిరగడం వలన రోడ్డు మొత్తం ధ్వంసమై భారీ గుంతల్లో వర్షపునీరు చేరి వాహనచోదకుల సహనాన్ని పరీక్షించారు. ఇదే విషయాన్ని గతంలో తిరిగి మళ్లీ మంగళవారం 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించడంతో భారీ గుంతలకు మాత్రం తాత్కాలిక మరమ్మతులు చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎమ్మెల్యే రాగమయి ఆధ్వర్యంలో సీఎం సభకు

పెనుబల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సభకు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు చంద్రుగొండ మండలం బెండాలపాడుకు బుధవారం కార్యకర్తలు, నాయకులు ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సుల్లో తరలివెళ్లారు. కాంగ్రెస్ నాయకులు పంది వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, సోమరాజు సీతారామారావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, వంగా దామోదర్‌రావు పాల్గొన్నారు.

కొణిజర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం జరిగే సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన బహిరంగసభకు మండల పరిధిలోని లాలాపురం గ్రామానికి చెందిన కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. నాయకులు పాసంగులపాటి రవి, చింతనిప్పు ప్రసాద్, మోదుగు వెంకట్, సపావత్ లక్ష్మణ్, తేళ్లూరి వీరయ్య, షేక్ ఖాసీం, రామారావు, శ్రీనివాసరావు, మదారు, వెంకటేశ్వర్లు, రాముడు, కోటిరెడ్డి, సోంద్‌సాహెబ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం సభకు ఆర్టీసీ బస్సులు.. తప్పని అవస్థలు

» ముందస్తు సమాచారం నిల్.. సంస్థపై ఆగ్రహం

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి సభకు సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి సుమారు 55బస్సులు ఏర్పాటు చేశారు. దీంతో మంగళవారం రాత్రి నుంచి సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణీకులు అవస్థలు పడటం కనిపించింది. ఎక్కువ మొత్తంలో డీలక్స్, సూపర్‌లగ్జరీ, రాజధాని ఏసీ, స్లీపర్ సర్వీసులు మాత్రమే అందుబాటులో ఉండటంతో సామాన్యులు లబోదిబోమన్నారు. అదేవిధంగా ఆయా బస్టాండ్లలో బస్సులు లేక సమీప ప్రాంతాల ప్రయాణీకులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు ఆర్టీసీ సంస్థపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

ముందస్తు సమాచారం నిల్.. సంస్థపై ఆగ్రహం

కనీసం ఎలాంటి ముందస్తు సమాచారం సంస్థపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం తదితర ప్రాంతాలకు వెళ్లే మహిళా ప్రయాణీకులు బస్సులు లేకపోవడంతో తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవడంతో వ్యాపారస్థులు నష్టపోయినట్లు పెదవి విరుస్తున్నారు. ప్రయాణీకులకు బస్సులను ఏర్పాటు చేయాల్సిన ఆర్టీసీ సంస్థ ఇలా బస్సులు లేకుండా ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వాలు విఫలం

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియాను అందించడంలో కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతుసంఘం, సీఐటీయూ జిల్లా నాయకులు రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావులు అన్నారు. యూరియా కొరత నేపథ్యంలో నిరసన వ్యక్తం చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రైతులు బుధవారం కాకర్లపల్లి రోడ్డులోని తెలంగాణ ఆగ్రోస్ ఎదుట ఆందోళన చేశారు. రైతులకు సబ్సిడీ ఎక్కువ ఇవ్వాల్సి వస్తుందని కేంద్రం కావాలనే రాష్ట్రాలకు సరఫరా చేయడం లేదని, పొట్టదశలో ఉన్న పంటకు పొటాస్‌తో కలిపి యూరియా చల్లితేనే ఎక్కువ దిగుబడి వస్తుందని వాపోయారు. సొసైటీల వద్ద వంద కట్టల కోసం 500మంది రైతులు క్యూలో నిల్చున్నా సరిపడా అందడం లేదన్నారు.

'అవినీతిపై మాట్లాడే అర్హత కమల్‌రాజ్‌కు లేదు'

మధిర, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అవినీతిపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నాయకుడు కమల్‌రాజ్‌కు లేదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ది కమీషన్ల మీద బతికిన చరిత్ర అని కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగినట్లు కేసీఆర్ కూతురే విమర్శిస్తున్నదని అన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మధిర నియోజకవర్గంలో చెప్పుకోవటానికి చేసింది ఏమీ లేదని ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సీతారామ ప్రాజెక్టును వైరా చెరువుకి అనుసంధానం చేసి వైరా ఏటిపై వంగవీడు వద్ద 600 కోట్లతో భారీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే ఓర్వలేక విమర్శిస్తున్నారని అన్నారు. కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంపా వెంకటేశ్వరరెడ్డి, నాయకులు అద్దంకి రవికుమార్, జహంగీర్, సంగయ్య, ఆవుల శ్రీను, జానీ పాల్గొన్నారు.